

సిఐటియు రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - గణపవరం

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కేశవరం వంతెన సెంటర్లో వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పి.గోవింద్ మాట్లాడుతూ జనవరి రెండో తేదీన జరిగే మహా ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పట్నాల శ్రీనివాసరావు, సిరికి శ్రీనివాసు, ఆదిరెడ్డి కన్నారావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

రబీ పనులు ముమ్మరం

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో రబీ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోవైపు సార్వా ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. మండలంలో 28,850 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యమవ్వగా అది దాదాపు పూర్తయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇక రబీ విషయానికి వస్తే మండలంలో గత సీజన్ మాదిరిగానే ప్రస్తుత సీజన్లో 13,736 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చేశామని వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. దీనికోసం 636 ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లు వేయాల్సి ఉండగా 85 శాతం నారుమడులు వేసే కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. మండల పరిధిలో ఇంతవరకు 350 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేసే కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులు గతంలో మాదిరిగా ఇ-క్రాప్‌లో నమోదు కావాలని సూచించారు. ఇక రైతుల కోసం అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతరాలను రైతుభరోసా కేంద్రాల వద్ద ఉంచినట్లు తెలిపారు. అలాగే ఆర్‌బికెల వద్ద వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉటారని వివరించారు.



వైభవంగా అభినయ నృత్యభారతి వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక వైఎంహెచ్ఎ హాలులో అత్యంత వైభవంగా మూడు రోజుల పాటు సాగిన అభినయ నృత్యభారతి 27వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. హేలాపురి లయన్స్ క్లబ్ సర్వీస్ ట్రస్ట్, హిందూ యువజన సంఘం, లయన్స్ జిల్లా 316జి, నెహ్రూ యువకేంద్రం సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు హేలాపురి ప్రజలకు నాట్య విందును అందించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన యువ శాస్త్రీయ నర్తకులు 15 మందికి నృత్య కౌముది, ఎనిమిది మంది సేవా తత్పరులకు సేవాతత్పర, 10 మంది నాట్యాచార్యులకు సేవా తపస్వి అవార్డులు అందించారు. 300 మంది చిన్నారులకు నృత్యపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చివరిరోజు కార్యక్రమంలో కలకత్తాకు చెందిన అతనుదాస్, కరుణ కేతన్ భక్త భరతనాట్యం, శ్రేజయని ఘోష్ మోహిని అట్టం, సిర్పూర్‌కు చెందిన గురుదేవ్ పేరిణి శివతాండవం, విజయవాడకు చెందిన శ్రుతిసుమన్స్, వరంగల్‌కు చెందిన శ్రీజ ఆంధ్రనాట్యం, హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ వెంకట్, చార్మిత వెంకట్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కళారత్న కెవి.సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనతో నృత్య ప్రదర్శన ప్రారంభమైంది, శైవ క్షేత్రం పీఠాధిపతి శివ స్వామీజీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మూడు రోజులు ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన నాట్యాచార్య లయన్ దువ్వి హేమసుందర్‌ను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి, ఎవి.వెంకటేశ్వ రావు, అఖిల భారత తెలుగుసేన రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ చౌదరి, జాతీయ మహిళా అధ్యక్షురాలు సిహెచ్. శ్రీదేవి, మలేసియా భరత నాట్య గురువు శ్రీగణేషన్, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ కనుమూరి రమేష్, సీనియర్ న్యాయవాది కానాల రామకృష్ణ, సిబర్ కళాశాల పిజి కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్ఞాపికలతో నృత్య కళాకారులు







కొత్త సంవత్సరంలో.. కొత్త కార్డులు

రేషన్ పంపిణీలో ఇబ్బందులు తొలగిస్తున్నాం

ఎప్పటికప్పుడు కమిషనర్ పర్యవేక్షణ

పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణరాజు



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి నూతన సంవత్సరంలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు తెలిపారు. జిల్లాలో రేషన్‌కార్డుల పంపిణీ విషయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా రేషన్ పంపిణీ సక్రమంగా సాగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడైనా ఎటువంటి ఇబ్బంది ఎదురైనా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన ప్రజాశక్తి 'ముఖాముఖి'లో పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.



ప్రశ్న: కొత్త ఏడాదిలో ఎన్ని కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు?

కొత్త సంవత్సరంలో జిల్లాలో 2,419 కార్డులు కొత్తగా మంజూరయ్యాయి. వాటిని పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేశాం. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే సచివాలయాల వ్యవస్థ ద్వారా వాటిని పరిశీలించి అందులో అర్హులైనవారికి కార్డులను పంపిణీ చేయడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ కొత్త కార్డులను కూడా ఈ నెల 27వ తేదీలోగా ఇచ్చేందుకు ఏర్పాట్లను చేస్తున్నాం. 2020 ఆగస్టు ఎనిమిదో తేదీ నుంచే సచివాలయాల ద్వారా రేషన్‌కార్డుల పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఆ విధంగానే పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: కొత్తకార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందా? మార్పులు చేశారా?

కొంతకాలం క్రితం వరకూ కొత్తకార్డుల దరఖాస్తుల స్వీకరణ, జారీ నిరంతరాయంగా సాగేది. అయితే అందులో ప్రభుత్వం కొన్ని మార్పులను చేసింది. కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు మాత్రం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని పరిశీలించి ప్రతి ఆరు నెలలకోసారి కొత్త కార్డులను జారీ చేస్తున్నాం. దీనివల్ల నిజమైన అర్హులను గుర్తించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

ప్రశ్న: జిల్లాలో ఎంతమందికి ఉచిత రేషన్ ఇస్తున్నారు?

జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన వారికి మాత్రం ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నాం. జాతీయ ఆహారభద్రతా ప్రమాణాల మేరకు ఈ పంపిణీ కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంతంలో అందరికీ ఉచిత రేషన్ పంపిణీ చేస్తున్నాం. నాన్ ఏజెన్సీలో మాత్రం ప్రభుత్వ నిబంధనల మేరకు పంపిణీ జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా 6.39 లక్షల రేషన్‌కార్డులుండగా అందులో 2.10 లక్షల కార్డులకు ఈ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాం.

ప్రశ్న: రేషన్ పంపిణీలో ఇబ్బందులు ఏమైనా గుర్తించారా?

జిల్లాలో ప్రస్తుతానికి రేషన్ పంపిణీ వ్యవస్థలో ఎక్కడా ఇబ్బందులు లేవు. ఎక్కడైనా చిన్నపాటి ఇబ్బందులు ఎదురైనా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి పరిష్కరిస్తున్నాం. 6.20 లక్షల యూనిట్ల బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నాం. కమిషనర్ ఈ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూనే ఉన్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

7,650 మందికి ద్వైవార్షిక లబ్ధి

27న ఖాతాల్లో జమ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మిగిలి ఉన్న అర్హులను వారిని గుర్తించి ద్వి వార్షిక ప్రణాళిక ప్రకారం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసే క్రమంలో 7,650 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగనుందని జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ద్వి వార్షిక కింద జిల్లాలో గుర్తించిన 7,650 మందికి రూ.11.23 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనాన్ని మంజూరు చేసి, డిసెంబర్ 27న జరిగే కార్యక్రమంలో సిఎం జగన్ వర్చువల్ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల చేస్తారని తెలిపారు. జగనన్న అమ్మఒడి పథకం కింద 1956 మంది లబ్ధిదారులకు రూ.2.54 కోట్లు, వైఎస్ఆర్ కాపు నేస్తం పథకంలో 1124 మంది లబ్ధిదారులకు రూ.1.68 కోట్లు అందించనున్నారని తెలిపారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తంలో ముగ్గురు లబ్ధిదారులకు రూ.72 వేలు, వైఎస్ఆర్ వాహన మిత్ర పథకంలో 295 మంది లబ్ధిదారులకు రూ.29.50 లక్షలు, వైఎస్ఆర్ చేయూత పథకం కింద 1346 మంది లబ్ధిదారులకు రూ.2.52 కోట్లు, ఇబిసి నేస్తంలో 43 మందికి రూ.6.45 లక్షలు, జగనన్న చేదోడులో 34 మందికి రూ.3.40 లక్షలు, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకంలో ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.80 వేలు, జగనన్న వసతి దీవెనలో 732 మందికి రూ.60.91 లక్షలు, జగనన్న విద్యా దీవెన కింద 2109 మంది లబ్ధిదారులకు రూ.3.46 కోట్లు మేర జిల్లాలోని అర్హులైన వారికి నిధులు విడుదల చేస్తారని వివరించారు.

ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ వేధింపులకు..

అత్తా కోడలు బలి..!

రుణ వాయిదా చెల్లింపు 15 రోజులు ఆలస్యం

ఇంటిని స్వాధీనం చేసుకుంటామని

బెదిరింపులతో తల్లడిల్లిన కుటుంబం

ప్రజాశక్తి - మొగల్తూరు

'కుటుంబ యజమాని ఇంటి నిర్మాణానికి తీసుకున్న రుణం వాయిదా చెల్లింపులో 15 రోజులు ఆలస్యమైంది. అంతే రుణమిచ్చిన ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ ఉద్యోగులు రంగంలోకి దిగి నేరుగా ఇంటికొచ్చారు. వాయిదా సొమ్ము వెంటనే చెల్లించకపోతే ఇంటిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన యజమాని భార్య గుండెపోటుతో శనివారం మృతి చెందింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యజమాని తల్లి ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రోజు వ్యవధిలో అత్తాకోడళ్లు మృతి చెందడం ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. ఈ ఘటన మండలంలోని పేరుపాలెం సౌత్‌లోని బెల్లంకొండవారిమెరకలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలాఉన్నాయి.

పేరుపాలెం సౌత్‌లోని బెల్లంకొండవారి మెరకకు చెందిన సుందర ఆంజనేయులు, రవిబాబు తండ్రీ కొడుకులు. రవిబాబు భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రవిబాబుకు భార్య, కుమార్తె (4), కుమారుడు (2) ఉన్నారు. రవిబాబు ఇంటి నిర్మాణానికి ఫుల్టన్ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5.50 లక్షలు రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా రూ.12,500 రుణ వాయిదా సక్రమంగా చెల్లిస్తున్నాడు. ఈ నెల ఆర్థిక ఇబ్బందుల రీత్యా వాయిదా చెల్లించలేకపోయాడు. దీంతో ఈ నెల 23న ఫుల్టన్ ప్రయివేటు ఫైనాన్స్ సంస్థకు చెందిన ఉద్యోగులు ఇంటికి వచ్చి వెంటనే రుణ వాయిదా చెల్లించకపోతే ఇంటిని స్వాధీనం చేసుకుని, వేలం వేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన రవిబాబు భార్య భారతి (24) ఈ నెల 24న తీవ్ర గుండెపోటుకు గురైంది. ఆసుపత్రికి తరలించేలోపు ఆమె ప్రాణాలు కోల్పోయింది. అనూహ్య ఘటనతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషయం చుట్టుపక్కలవారికి, బంధువులకు అందరికీ తెలియడంతో రవిబాబు తల్లి అంజమ్మ (57) తీవ్ర మనస్థాపానికి గురైంది. ఆదివారం ఉదయం అంతా పనుల్లో ఉండగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో వారు గుర్తించేటప్పటికే ఆమె విగతజీవిగా మారింది. వరుస ఘటనలతో బెల్లంకొండవారి మెరకలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. రోజు వ్యవధిలో కోడలు, అత్త మరణించడం అందరినీ కలిచివేసింది. సమాచారం అందుకున్న నరసాపురం సిఐ వాడవల్లి సురేష్‌బాబు, మొగల్తూరు ఎస్ఐ ఎం.వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అంజమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు రవిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.

వద్ధుల పించన్లపై భరోసా ఇవ్వండి

ఏలూరు అర్బన్:ఏలూరు జిల్లాలో 6,500 మంది వృద్ధాప్య పింఛన్లు పొందేవారికి అర్హత పరిశీలనలో భాగంగా నోటీసులు ఇవ్వడం పట్ల ఐఎన్‌టియుసి అధ్యక్షులు పులి శ్రీరాములు ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పింఛన్లు పొందుతున్న వారిలో అభద్రతాభావం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ప్రతీ ఆరు మాసాలకు ఒకసారి అర్హతలను పరిశీలించడం సరికాదన్నారు. ఉమ్మడి ఆస్తులు సాధారణంగా పెద్ద వారి పేరు మీద ఉంటాయని, ఆ కారణంగా నెలకు విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని చెప్పి పించన్లను ఆపొద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రసకందాయంలో రాజకీయం..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అధికార వైసిపిపై ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకీ పెరుగుతోంది. అదే సమయంలో దాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో ప్రధాన ప్రతిపక్షం టిడిపి ఈ ఏడాదీ అంత చురుగ్గా వ్యవహరించిన దాఖలాల్లేవు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని వైసిపి భావిస్తుండగా, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే తమకు అనుకూలిస్తాయని ప్రధాన ప్రతిపక్షం భావిస్తోంది. జనసేన జిల్లాలో ప్రధానంగా సేవా కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై పోరాడుతూ బలపడేందుకు యత్నిస్తుండగా బిజెపి, కాంగ్రెస్ ఇప్పటికీ తమ ఉనికిని చాటుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాయి. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజాసమస్యలే ఎజెండాగా వామపక్షాలు నిరంతరం పోరాటాలతో ముందుకు సాగుతున్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఈ ఏడాది ఆయా పార్టీల అధినాయకుల పర్యటనలతో జిల్లా రాజకీయం రసకందాయంగా మారింది.

అధికార వైసిపికి అసంతృప్తి సెగ

ఇంకా పుంజుకోని టిడిపి

స్థానిక సమస్యలపై దృష్టి కేంద్రీకరించిన జనసేన

ఉనికి కోసం బిజెపి, కాంగ్రెస్ పాట్లు

ప్రజా పోరాటాలే ఊపిరిగా వామపక్షాలు



ప్రజావ్యతిరేక విధానాలు, సొంత కుంపట్లతో మసకబారుతున్న వైసిపి ప్రతిష్ట


సంక్షేమ పథకాల అమలుతో వైసిపికి కొంత సానుకూలత ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా ఆ పార్టీ ప్రతిష్ట మసకబారుతోంది. ఈ ఏడాది నుంచి అమల్లోకి వచ్చిన పట్టణాల్లో చెత్త, ఆస్తి పన్ను, విచ్చలవిడిగా పెంచిన విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు, వ్యవసాయ విద్యుత్ మీటర్ల అమరికకు కసరత్తు, రహదారుల వ్యవస్థ అధ్వానంగా తయారైనా పట్టించుకోకపోవడం వంటి అనేక అంశాలు వైసిపిపై జనంలో అసంతృప్తిని పెంచాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లాల విభజన చేసినా ఇప్పటికీ గాడిన పరిస్థితి లేదు. నూతన జిల్లా కేంద్రం భీమవరంలో ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వరి రైతుల ఇబ్బందులు మరింత పెరిగాయి. రైతులు ధాన్యం అమ్మకంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం సొమ్ము జమ నెలలు తరబడి సాగడంతో ఈ ఏడాది రబీలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖరీఫ్‌లో తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానం రైతులను నిలువునా ముంచింది. ఆక్వా రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీ జోన్లకే పరిమితం చేయడం, రొయ్య వంద కౌంట్‌కు రూ.240 ధర అందేలా చేస్తామన్నా చేయలేకపోవడం, ఆక్వా మేత ధరలు పెరిగిపోవడం వంటి అనేక పరిణామాలు వైసిపిని వెంటాడుతున్నాయి. పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు పునరావాసం, పరిహారం పంపిణీ వంటివి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. గడిచిన ఆగస్టు, సెప్టెంబర్‌లో వరదలకు పోలవరం నిర్వాసితులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గోదావరి నుంచి తాగునీరు అందిస్తామని ఇచ్చిన వాటర్‌గ్రిడ్ హామీ సైతం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. రోడ్ల వ్యవస్థ అధ్వానంగా మారడంతో జనాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. 45 ఏళ్ల పైబడిన మహిళలకు ఇస్తున్న చేయూత, అమ్మఒడి పథకాలు ప్రభుత్వానికి కొంత సానుకూలత తెచ్చినప్పటికీ పెరిగిన ధరలు, నూతన విద్యావిధానం అమలు, ఎయిడెడ్ విద్యాసంస్థల విలీనం వంటి వాటిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ సాయం సరిపోకపోవడం, లేఅవుట్లలో పలు సమస్యలు ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడానికి కారణంగా మారాయి.



రెండోవిడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండు మంత్రి పదవులు కేటాయించినప్పటికీ ఏలూరు జిల్లాకు ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం చర్చనీయాంశమైంది. ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు మంత్రి పదవులు కోల్పోయారు. చెరుకువాడను కొనసాగించకపోవడం క్షత్రియ సామాజిక తరగతిలో కొంత అసంతృప్తికి కారణమైంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై గెలుపొందిన గ్రంధి శ్రీనివాస్‌కు చివరి నిమిషంలో మంత్రి పదవి చేజారడం సొంత పార్టీపైనే వ్యతిరేకతకు కారణమైంది. ఇక జిల్లా కేంద్రం విషయంలో నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి, మాజీ మంత్రి కొత్తపల్లి మధ్య సాగిన మాటల యుద్ధం అధిష్టానానికి తలనొప్పి తెచ్చిపెట్టింది. చివరకు పార్టీ నుంచి కొత్తపల్లి సస్పెన్షన్‌కు దారితీసింది. ఇక ఉండి నియోజకవర్గంలో తరచూ ఇన్‌ఛార్జీల మార్పు ఈ ఏడాదీ కొనసాగడం ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో వైసిపి నేత గంజి ప్రసాద్‌ను అదే పార్టీకి చెందిన ఎంపిటిసి బజారయ్య హత్య చేయించడం, ఆ గ్రామానికి వెళ్లిన గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావును సొంతపార్టీవారే నిర్బంధించి దాడికి పాల్పడటం ఆ పార్టీలో నెలకొన్న గ్రూపు విబేధాలను ప్రతిబింబించింది. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎల్ఎ ఎలిజా, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఈ ఏడాదీ కొనసాగాయి. జిల్లా కేంద్రం ఏలూరులో అయితే మేయర్‌పై, కమిషనర్‌పై సొంత పార్టీ నేత విమర్శలు గుప్పించడం, కార్పొరేటర్ అవినీతి ఆరోపణలు చేయడం వైసిపి ప్రతిష్టను బాగా దెబ్బతీశాయని చెప్పొచ్చు.

బలం పుంజుకోని టిడిపి

ప్రభుత్వంపై వస్తున్న ప్రజావ్యతిరేకతను తమవైపు తిప్పుకునేలా ప్రధాన ప్రతిపక్షం టిడిపి ఇంకా క్షేత్రస్థాయిలో చురుగ్గా కదులుతున్న పరిస్థితి లేదు. రాష్ట్ర నాయకత్వం పిలుపులను అమలు చేయడం తప్ప జిల్లాలోని ప్రజా సమస్యలపై ముందుండి పోరాడటంలో టిడిపి నాయకులు పెద్దగా చొరవచూపిన పరిస్థితి లేదు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రజా సమస్యలపై పోరాడుతూ ముందుకు సాగుతున్నా మిగిలిన నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కన్పించడం లేదు. టిడిపి అధినేత చంద్రబాబు ఇటీవల మెట్ట ప్రాంతంలో మూడురోజుల పాటు చేసిన పర్యటన పార్టీ కేడర్‌లో కొంత ఉత్సాహాన్ని తెచ్చింది. టిక్కెట్ల కేటాయింపు విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లోనూ కొంత స్తబ్ధత నెలకొంది. ఇప్పటికీ ఆ పార్టీలో అంతర్గతంగా ముఠా కుమ్ములాటలు సాగుతుండటం గమనార్హం. చింతలపూడి నియోజకవర్గంలో మాజీ మంత్రి సుజాత, మాజీ ఎంపీ మాగంటి గ్రూపులు వేర్వేరుగానే ఉన్నాయి. పోలవరంలోనూ అదే సమస్య కొనసాగుతోంది. ఉండిలో సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ శివ సోదరులైనప్పటికీ అంతర్గతంగా వేర్వేరు గ్రూపులుగానే శ్రేణులు కదులుతున్నాయి. నరసాపురంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, పొత్తూరి రామరాజు మధ్య విబేధాలు అలానే కొనసాగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నప్పటికీ నియోజకవర్గాల్లో నాయకత్వ లోపం టిడిపిని వెంటాడుతోంది.



ఉనికి కోసం బిజెపి, కాంగ్రెస్ పాట్లు

జిల్లాలో ఈ సంవత్సరం కూడా బిజెపి, కాంగ్రెస్ ఉనికిని చాటుకునేందుకు కొటుమిట్టాడుతున్నాయి. ఇటీవల బిజెపి రాష్ట్ర, జాతీయ నాయకులు జిల్లాలో పర్యటిస్తున్న పెద్దగా స్పందన లేదు. పోలవరానికి నిధులివ్వకపోవడం, గ్యాస్, పెట్రోల్, వంటనూనె ధరలు వంటివి పెంపుతో బిజెపిపై జనం మండిపడుతున్నారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం నాయకులు సైతం లేని పరిస్థితి ఏర్పడింది.

సేవా కార్యక్రమాలపైనే జనసేన దృష్టి

ఈ ఏడాది జనసేన జిల్లాలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయడంతోపాటు స్థానిక సమస్యలపై దృష్టి సారించి ముందుకు సాగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపును విస్తరించడానికి ఆ పార్టీ ముమ్మర ప్రయత్నం చేస్తోంది. ప్రధానంగా గ్రామీణప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు, శ్రమదానాలు ఆ పార్టీకి సానుకూలతను తెచ్చిపెట్టాయి. అయితే ఇప్పటికీ ఆ పార్టీలో కేడర్ సమస్య ఉంది.

ప్రజలకు అండదండగా వామపక్షాలు


ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా పోరాటాలు ఈ ఏడాది వామపక్షాలు సాగించాయి. జిల్లాలో సిపిఎం ప్రధాన భూమిక పోషిస్తూ సిపిఐ, న్యూడెమోక్రసీ వంటి పార్టీలను కలుపుకుని వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలను సాగిస్తోంది. వరదల సమయంలో నిర్వాసితులను ఆదుకోవడంలో సిపిఎం ముందు వరుసలో నిలిచింది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం అలుపెరుగని పోరాటం చేస్తోంది. వరి రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, ధరల పెరుగుదల, కార్మికుల సమస్యలు వంటి ప్రజాసమస్యలపై నిరంతరం పోరుబాట సాగిస్తూ ప్రజలతో వామపక్షాలు మమేకమై ముందుకు సాగాయి.



నేడు వంగవీటి రంగ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - భీమడోలు

స్థానిక సంతపేటలో కాపు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయవాడ మాజీ శాసనసభ్యులు వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని ఈనెల 26న ఆవిష్కరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దాతల సహకారంతో 8.1 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ కాంస్య విగ్రహాన్ని మాజీ ఎంఎల్ఎ వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరిస్తారన్నారు. విగ్రహ దాత ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు విగ్రహావిష్కరణకు అధ్యక్షులుగా వ్యవహరిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్‌తో పాటు, వైసిపి ఉంగుటూరు నియోజకవర్గ నేత పుప్పాల కార్తిక్ పాల్గొంటారన్నారు.



సాయం అందిస్తున్న మానవత సభ్యులు

ఆపన్నులకు మానవత సాయం

ప్రజాశక్తి - భీమడోలు

మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సూరప్పగూడెంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు శాఖ ఛైర్మన్ జి.సూరరాజు తెలిపారు. శాఖ నెలవారీ సమావేశాన్ని సూరప్పగూడెంలో ఆదివారం శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ ద్వారా ఇటీవల కాలంలో చేపట్టిన, చేపట్టనున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యావసర వస్తువులు, సాయిరాం క్లాత్ షోరూం సౌజన్యంతో దుస్తులు అందజేశారు. అలాగే దాతలు కె.శ్రీనివాసరావు, ఎస్ఎన్‌డి.రాణి, మాజీ సర్పంచి వెజ్జు సూర్యకుమారి, కొండలరావు దంపతులు మానవత శాఖ ద్వారా వందమంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత శాంతిరథం విభాగపు జిల్లా ఛైర్మన్ అప్పల రాంబాబు, గంధం వెంకట్రావు పాల్గొన్నారు.

27న పిఎంపి అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - భీమడోలు

పిఎంపి అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 27వ తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉభయగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి పి.జయరావు తెలిపారు. భీమడోలులోని కార్యాలయంలో ఆదివారం గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముఖేష్ అగర్వాల్, ప్రదీప్ కాశ్యప్ హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథిగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, అతిథులుగా మంత్రులు తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, కె.గోవర్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ కె.శ్రీనివాస్, ఎంపీలు ఎం.భరత్ రామ్, కె.శ్రీధర్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, పుప్పాల వాసుబాబు, కె.అబ్బయ్య చౌదరి హాజరవుతారన్నారు.



టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిఐ మల్లేశ్వరరావు

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం

ప్రజాశక్తి - చింతలపూడి

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శరీర దారుఢ్యానికి దోహదపడతాయని చింతలపూడి సిఐ మల్లేశ్వరావు అన్నారు. పట్టణంలో బోయగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను నగరపంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, వైసిపి యూత్ మండల అధ్యక్షులు వెంప కృష్ణ ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువకులు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడా స్ఫూర్తితో ముందుకుసాగాలని, గెలుపోటములు సహజమని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రహీమ్, తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా బస్టాండ్ రోడ్డు

రోడ్డు విస్తరణ పనులు.. ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

165 జాతీయ రహదారి విస్తరణ పనులు ముదినేపల్లిలో నెల రోజులుగా సాగుతున్నాయి. విస్తరణ పనుల్లో భాగంగా తొలుత కంట్రాక్టర్ ముదినేపల్లి సెంటర్‌లో రహదారికి ఇరువైపుల డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపట్టారు. ముదినేపల్లి బస్టాండ్ వద్ద చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనుల కారణంగా వాహనదారులు, పాదచారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ముఖద్వారం ముందు నెల రోజులుగా మురుగునీరు నిలిచిపోయింది. డ్రెయిన్ నిర్మాణ పనుల్లో భాగంగా వచ్చిన ఊట నీటిని సిబ్బంది రోడ్డుపైకి మోటర్ల ద్వారా తోడుతున్నారు. దీంతో మురుగునీరు రోజులు తరబడి బస్టాండ్ ముఖద్వారం ముందు నిలిచిపోవడంతో ప్రయాణీకులు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న ఊట నీటిని బయటకు మళ్లించకుండా వదిలివేయడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణీకులు, బస్సు దిగి బయటకు వచ్చే వారికి ఇబ్బందికరంగా మారింది. రోజుల తరబడి నీరు రోడ్డుపై నిలిచి ఉండటంతో పాకుడు వల్ల ప్రయాణీకులు జారి పడిపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ప్రయాణీకులు లోపలికి రాకపోకలు సాగించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు వెళ్లేటప్పుడు మురుగునీరు చింది ప్రయాణికులపై పడటంతో దుస్తులు పాడవుతున్నాయని పలువురు వాపోయారు. నిత్యం వందలాది మంది విద్యార్థులు బస్టాండ్‌కు వస్తుంటారు. ముఖద్వారం వద్ద రోడ్డు దాటే క్రమంలో, బస్సులు ఎక్కే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

మొండి గోడలు.. పిచ్చిమొక్కలు..!

ముందుకుసాగని సచివాలయ భవనాల పనులు
ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి
అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారిన వైనం
బిల్లులు చెల్లించకపోవడమే కారణం..!
ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి

సచివాలయ భవనాల నిర్మాణం ఎక్కడవేసిన గొంగళిఅక్కడే అన్నచందంగా తయారైంది. ఎంతో ఆర్భాటంగా నిర్మిస్తున్న ఈ భవన పనులు ప్రారంభించి మూడేళ్లవుతున్నా నేటికీ ఓ కొలిక్కి రాలేదు. తొలుత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సందర్భంలో తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయాల్లోనే హడావుడిగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. దీంతో ఆ కార్యాలయాల్లో పనుల నిర్వహణ, కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఏర్పాటుకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రతీ సచివాలయానికి నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెంటనే టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్లకు పనుల బాధ్యతను అప్పగించింది. అక్కడి వరకు శరవేగంగా నిర్ణయాలు జరిగినప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుతం ఎక్కడికక్కడ నిర్మాణాలు నిలిచిపోయాయి. ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియడం లేదు. అసంపూర్తి నిర్మాణాలతో, మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా చింతలపూడి మండలంలోని సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసం నిర్మిస్తున్న ఈ భవనాలు ఇలా అధ్వానంగా తయారవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా 2021 నాటికే ఈ భవనాలు పూర్తిచేయాల్సి ఉంది. కానీ 2022 సంవత్సరం కూడా ముగుస్తున్నా పూర్తయ్యే పరిస్థితి లేదు. దీనికితోడు రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు వస్తున్నాయనే సంకేతాలు రావడంతో ఈ భవనాలు పూర్తయ్యే పరిస్థితి ఇప్పట్లో లేదని పలువురు విమర్శిస్తున్నారు.

చింతలపూడి మండలంలో మొత్తం 21 గ్రామ సచివాలయాలు, నగరపంచాయతీ పరిధిలో ఐదు సచివాలయాలు కలిపి మొత్తం 25 భవనాలు నిర్మించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకూ యర్రగుంటపల్లి, యండపల్లి గ్రామాల్లో మాత్రమే సచివాలయాలు పూర్తయ్యాయి. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి. నగరపంచాయతీ పరిధిలోని సచివాలయాలు అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు.

నిలిచిన బిల్లులు.. ముందుకు సాగని పనులు

కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు నిలిపివేయడంతో సచివాలయ భవనాలు ముందుకుసాగడం లేదని తెలిసింది. తమ వద్ద సొమ్ములున్నంత వరకూ పనులు చేపట్టామని, ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదని, దీంతో పనులు నిలిచాయని పలువురు కాంట్రాక్టర్లు వాపోయారు.

చోరీకి గురవుతున్న నిర్మాణ సామగ్రి

పలుచోట్ల నిర్మాణ సామగ్రి చోరీకి గురవుతుంది. నిర్మాణానికి తీసుకొచ్చిన సామగ్రి నెలల తరబడి ఉంచడంతో కొంత పాడవడంతో పాటు, మరికొంత చోరీకి గురవుతోంది. కొన్నిచోట్ల సిమెంట్ బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా మారాయి. అసంపూర్తి భవనాల్లో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి.



అసంపూర్తిగా ఉన్న నాగిరెడ్డిగూడెం సచివాలయ భవనం



పాతచింతలపూడి సచివాలయ భవనంలో గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

ఎప్పటికి పూర్తయ్యేనో..!

పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఈ భవనాలు ఓ కొలిక్కి రాలేదు. ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియడం లేదు. రెండేళ్లలో భవనాలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు విడుదల చేసి ఉంటే పనులు పూర్తయ్యేవని పలువురు చెబుతున్నారు. కొన్నిచోట్ల కనీసం గోడలు కూడా పూర్తికాలేదు. ఉన్నతాధికారులు పరిశీలినకు వచ్చిన సందర్భంలో మాత్రమే త్వరగా పూర్తిచేయాలంటూ కాంట్రాక్టర్లకు ఆదేశాలిచ్చి వెళ్లిపోవడం తప్ప ఎలాంటి పురోగతీ లేదు. ఈ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ప్రజలకు తప్పని అవస్థలు

సచివాలయ భవనాలు పూర్తికాకపోవడంతో పంచాయతీ కార్యాలయాల్లో సరైన సౌకర్యాల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గదులతో కార్యాలయాలకు వెళ్తున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు విధులు నిర్వర్తించేందుకు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సైతం నానా అవస్థలు పడుతున్నారు. అద్దె భవనాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

పనులు జరుగుతున్నాయి
మణికుమారి, ఎంపిడిఒ

మండలంలో సచివాలయ భవన నిర్మాణాలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల ఆలస్యమవుతున్నాయి. ఆయా కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నాం. ఎప్పటికప్పుడు ఈ సమాచారం ఉన్నతాధికారుల దృష్టిలో పెడుతున్నాం. త్వరగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

ఆర్‌టిసి బస్సు - ట్రాలీ ఢీ

పెదపాలపర్రు వద్ద ప్రమాదం - ఒకరి పరిస్థితి విషమం, 10 మందికి గాయాలు - స్థంభించిన ట్రాఫిక్

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సును ట్రాలీ ఢీకొట్టిన ఘటనలో 11 మంది గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పెదపాలపర్రు వద్ద పామర్రు - కత్తిపూడి 214 రహదారిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ డిపోకు చెందిన ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సు సాయంత్రం 4-30 గంటల సమయంలో గుడివాడ నుంచి ప్రయాణీకలతో కైకలూరు బయలుదేరింది. బస్సు పెదపాలపర్రు వద్ద బస్సు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ కూడా వెంటనే సడన్ బ్రేక్ వేశాడు. ఈ తరుణంలో బస్సు వెనుక అతివేగంగా వస్తున్న ట్రాలీ బస్సును బలంగా ఢీకొట్టింది. అదేసమయంలో ట్రాలీ వెనుక ద్విచక్రవాహనంపై వస్తున్న ట్రాలీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బస్సు వెనుక భాగం, ట్రాలీ ముందు బాగం బాగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పెదపాలపర్రుకు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఎం.రత్నారావు(35) తలకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బస్సులో 10 మంది ప్రయాణీకులకు స్వల్ప గాయాలయాయి. ఈ ప్రమాదంలో బస్సు, ట్రాలీ రోడ్డుకు మధ్యలో నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ షణ్ముఖసాయి, సిబ్బందితో ఘటనా స్థలానికి చెరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండు గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. క్రేన్ సహాయంతో ట్రాలీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి గురైన ఆర్‌టిసి బస్సు



గాయపడిన రత్నారావు

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బంధంచర్లలో కోడిపందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.4వేల50 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు.

దార్శనికులు వాజ్‌పేయి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప దార్శినికుడు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి అని వక్తలు కొనియాడారు. ఆదివారం ఆయన 98వ జయంతి సందర్భంగా స్థానిక రెండో వార్డులో మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాషా, మండల అధ్యక్షులు కట్టా వీర రాఘవులు ఆధ్వర్యంలో జయతిని నిర్వహించారు. సబ్ జైలులో ఖైదీలకు పండ్లు పంచారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కీర్తి రాంప్రసాద్, సీనియర్ నాయకులు విష్ణు రావు మాట్లాడుతూ వాజ్‌పాయ్ దేశం కోసం, ధర్మంకోసం తన జీవితాన్ని అంకితం చేశారని, దేశంలో పనికి ఆహార పథకం, గ్రామీణ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజి పథకాల ద్వారా గ్రామీణ రహదారుల నుండి జాతీయ రహదారుల వరకు నిర్మాణం చేశారన్నారు. పొఖ్రాణ్‌లో అణు పరీక్షలతో భారత్ కీర్తి ని ప్రపంచ దేశాలకు చాటారని వివరించారు. ఆయన జీవితం మార్గదర్శకం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామర్తి రాంబాబు, వేంపాటి గోవింద చంద్రశేఖర్, దేవి, బొల్లా శ్యామలరాజు, మహాలక్ష్ముడు, చిన్నికేష్ణ, సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రత్యేక ప్రార్థనలతో చర్చిలు కళకళ

ప్రజాశక్తి - ముదినేపల్లి

క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొన్ని చర్చిల్లో శనివారం రాత్రి పది గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకూ వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకూ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, యువకులు, చిన్నలు, పెద్దలతో చర్చిలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. మండలంలోని వణుదుర్రు ఆర్‌సిఎంలో జరిగిన వేడుకల్లో ఎంఎల్ఎ తనయులు దూలం వినయ్‌కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. చినపాలపర్రులోని పెంతెకొస్తు చర్చిలో టిడిపి యువనేత కొడాలి వినోద్ కేక్‌కట్ చేశారు. పేదలకు వస్త్రాలు, పండ్లు ఫలహారాలు అందజేశారు. ముదినేపల్లిలోని ఎల్ఇఎఫ్, ఆర్‌సిఎం, క్రీస్తు సంఘం పెంతెకొస్తు, సిబిసిఎన్‌సి, సాల్వేషన్ ఆర్మీ తదితర చర్చిల్లో క్రీస్తు జననం నాటికలు ప్రదర్శించారు. ఆయా వేడుకల్లో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి నాయకులు బొర్రా శేషబాబు, సాక్షి సాయి, కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : క్రిస్మస్ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రకాష్‌నగర్‌లోని షాలేము సహవాస ప్రార్థనా మందిరంలో మండల యునైటెడ్ పాస్టర్ల అసోషియేషన్ సంఘ అధ్యక్షులు జి.జ్ఞానరాజు కేక్ కట్ చేశారు. మర్రిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం, పుట్రేపు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వృద్ధులకు, వితంతువులకు వస్త్రాలు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రత్యేక నృత్యాలతో అలరించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు కె.నిరీక్షణరావు, సిహెచ్.హోషేయ, టి.ప్రసన్న కుమార్, డి.ప్రసన్న రాజు, సిహెచ్.రమేష్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : క్రీస్తు బోధనలు అనుసరణీయమని శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని భుజబలపట్నం లుక్ మెమోరియల్ బాప్టిస్టు ఆలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన ప్రేమ, దయ, కరుణ, త్యాగం క్రీస్తు బోధనల్లోని ప్రధాన అంశాలని, ప్రతిఒక్కరూ వీటిని తప్పక అనుసరించాలని సూచించారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ముసునూరి సీతారామరాజు, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు బిషప్ హౌస్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. బిషప్ పొలిమేర జయరావు వీరికి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం శాంతినగర్‌లోని మన్న చర్చికి వెళ్లి ఏలీషా రాజు, జ్యోతి రాజు ఆశీస్సులు పొంది శుభాకాంక్షలు తెలిపి, క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.


చర్చిలు కళకళ

క్రిస్మస్ పండుగ సందర్భంగా నగరంలోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక బాలయోగి వంతెన సమీపంలోని ఇశ్రాయేలు పేటలో సెయింట్ జాన్స్ ఆర్‌సిఎం చర్చిలో ఏలూరు కతొలికా పీఠం బిషప్ జయరావు పొలిమేర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెరికే వరప్రసాద్ వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. పెరికే ప్రసాద్ దంపతులు బిషప్‌ను ఘనంగా సన్మానించారు.


ముసునూరు : ప్రేమ, కరుణ, దయ, స్నేహం ప్రతి ఒక్కరూ అలవర్చుకుని ఏసుక్రీస్తు మాదిరి అందరి మన్ననలు పొందాలని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. మండలంలోని లోపూడిలోని చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాల్లో ఆయా చర్చిల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆగిరిపల్లి : క్రిస్మస్ వేడుకలు మండలంలోని చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కనసానపల్లి పరిశుద్ధ పౌల్ సిఎస్ఐ చర్చిలో పాస్టర్లు కె.ఐజక్‌జాన్, సిహెచ్.శశిధర్, కొల్లూరి మార్క్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెం ఆర్అండ్‌ఆర్ కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాసిత కాలనీలో వేలేరుపాడు మండలం శ్రీరామపురం కాలనీ వాసులు రేవరెంట్ బాబూరావు సమక్షంలో ప్రార్థనా గీతాలు ఆలపించారు. అలాగే 10 కిలోల కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జి.వెంకటేశ్వర్లు, పి.నరసింహారావు, బద్దె ప్రేమ్‌కుమార్, సుందర్‌రావు, సుధాకర్, డాన్ శ్రీను పాల్గొన్నారు.



ముదినేపల్లిలో..



కైకలూరులో..



ఏలూరులో జయరావుకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ దంపతులు



జంగారెడ్డిగూడెంలో..